క్లుప్తంగా

నిబంధనలకు లోబడి తనిఖీలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సూర్యనారాయణ

గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, నిబంధనలకు లోబడి సామాజిక తనిఖీలు నిర్వహించాలని ఎంపీడీవో పి.సూర్యనారాయణ ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తనిఖీ బృందం సభ్యులు, ఉపాధి హామీ పథకం సిబ్బందితో శుక్రవారం సమావేశమైన ఆయన.. మండలంలోని 25 పంచాయతీల్లో గతేడాది ఏప్రిల్ నెల నుంచి ఈ ఏడాది మార్చి నెల వరకు వివిధ గ్రామాల్లో రూ.20 కోట్ల పనులు జరిగాయన్నారు. ఈ పనుల్లో పాల్గొన్న వేతనదారులకు వేతనాల రూపంలో రూ.15.75 కోట్లు, మెటీరియల్ కింద రూ.4.37 కోట్లు వెచ్చించడం జరిగిందన్నారు. 17వ విడత సామాజిక తనిఖీలకు ఏడు బృందాలను నియమించడం జరిగిందని పేర్కొన్నారు. తనిఖీ బృందాలకు అవసరమైన రికార్డులను క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులు అందజేయాలన్నారు. ఉపాధి పనులతో పాటు పింఛన్లు కూడా పరిశీలించడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఏపీవో ఎం.గౌరీనాథ్, ఎస్ఆర్‌పీ బి.దాసు, డీఆర్‌పీలు బి.శివ, శ్రీనివాసరావు, వరహాలరావు, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగికి సన్మానం



మేనేజర్ బంగారునాయుడును సన్మానిస్తున్న బ్యాంక్ మిత్ర, సీసీఎస్‌లు

భామిని: మండలంలోని బత్తిలిలో ఏపీజీవీబీ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహించి బదిలీపై వెళ్లిపోతున్న బంగారునాయుడును సీసీఎస్‌లు, బ్యాంక్‌మిత్రలు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీసీఎస్ ఏరియా మేనేజర్ తామరసిల్లి సురేష్, తదితరులు మాట్లాడుతూ, బంగారునాయుడు ఆధ్వర్యంలో రైతులు, మహిళలకు ఆర్థిక చేయూత అందించినట్లు చెప్పారు. బదిలీ జరిగిన ప్రాంతంలో కూడా మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.

ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్ పరిశీలన



సరుకుల నిల్వలను పరిశీలిస్తున్న సివిల్ సప్లయి జిల్లా మేనేజర్ నాయక్

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్‌ను సివిల్ సప్లయి జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్ శుక్రవారం పరిశీలించారు. అక్కడి రికార్డులు, సరుకుల నిల్వలు గమనించి, రేషన్ సరుకుల పంపిణీలో జాప్యం జరగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. రేషన్ సరఫరా వాహనాలకు తప్పనిసరిగా జీపీఎస్ అనుసంధానం చేసి ఉండాలన్నారు. డీఆర్ డిపోలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలకు నెలనెలా అందించే రేషన్ సరుకులను సకాలంలో సరఫరా చేయాలని తెలిపారు. గొడౌన్ లోపల, బయట పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని గొడౌన్ సూపరింటెండెంట్ ఎం.సాంబశివరావుకు సూచించారు. జిల్లాలో 2.80 లక్షల బియ్యంకార్డులు ఉన్నాయని, వారి కోసం నెలనెలా 5 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నామని, కార్డుదారులకు అవసరం మేరకు చోడిపిండి, గోధుమపిండి కూడా సరఫరా చేస్తున్నామన్నారు.

బదిలీ

సీతంపేట: స్థానిక ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్ పాండ్రంకి రవికుమార్‌కు విజయనగరం జిల్లా జర్జాపుపేట బ్రాంచ్‌కు బదిలీ జరిగింది. ఈమేరకు సహచర సిబ్బంది శుక్రవారం ఆయన్ను ఘనంగా సత్కరించారు.

నేడు వైస్ చాన్సలర్ రాక

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్రలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాలకు వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ తోలేటి జానకీరాం శనివారం విచ్చేస్తున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ బి.ప్రసన్నకుమార్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. సాయంత్రం జరిగే కళాశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొని, విద్యార్థులను ఉద్దేశించి, ప్రసంగిస్తారన్నారు. వెంకటరామన్నగూడెం వర్సిటీ నుంచి వస్తున్న ఆయనకు మనమంతా ఘనస్వాగతం పలకాలన్నారు.

పాలిథిన్ కవర్లు విక్రయిస్తే చర్యలు

పాలకొండ : నిషేధిత పాలిథిన్ కవర్లు విక్రయించినా, వినియోగించినా చర్యలు తప్పవని నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు హెచ్చరించారు. పట్టణంలోని పలు దుకాణాల్లో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. పాలిథిన్ కవర్లు విక్రయిస్తున్న వ్యాపారులకు జరిమాన విధించారు.



వీరఘట్టం: యోగా ప్రాముఖ్యతను ఉపాధి కూలీలకు వివరిస్తున్న ఎంపీడీవో సుబ్రహ్మణ్యం



గుమ్మలక్ష్మీపురం ఎంపీడీవో కార్యాలయంలో యోగాసనాలు సాధన చేస్తున్న ఎంపీడీవో జగదీష్‌కుమార్, సిబ్బంది



పాలకొండ రూరల్: రుషి యోగా కేంద్రంలో ఆసనాల్లో నిమగ్నమైన ఔత్సాహికులు



పాలకొండ: మండలంలోని కొండాపురంలో యోగా చేస్తున్న విద్యార్థులు



భామిని: యోగాసనాలలో మోడల్ స్కూల్ విద్యార్థులు



వీరఘట్టం: యోగాసనాలు వేస్తున్న వీరఘట్టం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు

‘యోగ’మస్తు..!

అంతర్జాతీయ యోగా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, కార్యాలయాల్లో ఉదయం జరిగిన ఈ కార్యక్రమంలో యోగా గురువులు పాల్గొని, యోగా విశిష్టతను వివరించారు. అనంతరం పలు యోగాసనాలు నేర్పించి, వాటి ప్రయోజనాలు తెలిపారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, మనందరి దైనందిన కార్యక్రమాల్లో యోగా ఒకభాగం కావాలని పిలుపునిచ్చారు. అనేక శారీరక, మానసిక రుగ్మతల నుంచి యోగా ఉపశమనం కలిగిస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కొన్ని కోట్లమంది జీవితాల్లో యోగా ఇప్పుడు భాగమవడం యోగాకున్న శక్తికి నిదర్శనమన్నారు.

-పాలకొండ, కురుపాం సాక్షి నెట్‌వర్క్.



సీతంపేట: యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, అధికారులు



వీరఘట్టం: యోగాసనాలు వేస్తున్న గడగమ్మ పాఠశాల విద్యార్థులు



కురుపాం కోర్టులో యోగాసనాలు వేస్తున్న సిబ్బంది



భామిని: యోగాసనాలు వేస్తున్న మోడల్ స్కూల్ టీచర్లు



జియ్యమ్మవలస: యోగా ఆకృతిలో నిల్చొన్న చినమేరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు



గరుగుబిల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ ఆర్ఐటీఐలో యోగాసన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్



పాలకొండ రూరల్: డీఏవీ పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



పాలకొండ రూరల్: న్యాయస్థానం ప్రాంగణంలో యోగాలో నిమగ్నమైన న్యాయమూర్తి విజయ్‌రాజ్‌కుమార్

సకాలంలో ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి



గ్రామ సచివాలయ ఉద్యోగులకు సెక్యూరిటీ పేపర్స్ ఇస్తున్న ఎంపీడీవో జగదీష్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులకు సకాలంలో ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని గ్రామ సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు ఎంపీడీవో జి.జగదీష్‌కుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వారితో శుక్రవారం సమావేశమైన ఆయన.. డుమా కార్యాలయం నుంచి వచ్చిన సెక్యూరిటీ పేపర్స్‌ను వారికి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విద్యాసంవత్సరం ప్రారంభం నేపథ్యంలో ప్రతీ విద్యార్థికి కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు అవసరమవుతాయని, వాటి కోసం దరఖాస్తు విద్యార్థులకు వాటిని వెంటనే అందించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ రాజముద్ర కలిగిన సెక్యూరిటీ పేపర్స్‌లో మాత్రమే వాటిని ప్రింట్ చేసి ఇవ్వాలని, అందుకు తగ్గట్టుగా పేపర్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. మండలంలో మొత్తం 24 గ్రామ సచివాలయాలు ఉన్నాయని, ఒక్కో సచివాలయానికి రెండో విడతలో 160 పేపర్లు చొప్పున ఇస్తామన్నారు.

గ్రామాల్లో ఫీవర్ సర్వే..



ఏఎన్ఎంలతో మాట్లాడుతున్న డాక్టర్ ప్రదీప్

వీరఘట్టం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఫీవర్ సర్వే చేపట్టాలని స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ప్రదీప్ సూచించారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని.. అందువల్ల ఏఎన్ఎంలు గ్రామాల్లో అందుబాటులో ఉంటూ సేవలందించాలని సూచించారు. అలాగే గర్భిణులకు పరీక్షలు నిర్వహించి, వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు చేసుకునేలా గర్భిణులను ప్రోత్సహించాలని తెలిపారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



రావివలసలో చిన్నారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి

గరుగుబిల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లల్లో ఐదేళ్ల వయసు దాటిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రౌతు లక్ష్మి సూచించారు. కొమరాడ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని రావివలస, పెదగుడబ సెక్టార్‌లలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదేళ్ల వయసు దాటిన పిల్లలకు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందించడం జరుగుతుందని, రెండేళ్ల వయసున్న పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు.

పిల్లలందరినీ బడికి పంపాలి..



ర్యాలీలో నినాదాలు చేస్తున్న అధికారులు, విద్యార్థులు

సీతంపేట: బడిఈడు పిల్లలందరినీ పాఠశాలలకు పంపాలని గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర కోరారు. మండలంలోని మల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో ‘నేను బడికి పోతా’ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు.

కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి పి.నారాయుడు, ఏఎంఓ పి.కోటిబాబు, హెచ్ఎం ఏవీ శ్రీనివాసరావు, సీఎంఓ చిరంజీవులు, సమన్వయకర్త ముకుందరావు, తదితరులు పాల్గొన్నారు.

పొగాకుకు దూరంగా ఉండండి..

పాలకొండ రూరల్ : పొగాకు వద్దు.. జీవితమే ముద్దు.. అని పాలకొండ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ బి. నాగభూషణరావు అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినంలో భాగంగా మే 31 నుంచి జూన్ 21 వరకు నిర్వహించిన అవగాహన కార్యక్రమాలను శుక్రవారంతో ముగించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ సోషల్‌వర్క్ అధికారి ఎ. భవానీ ఆధ్వర్యంలో ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పొగాకు వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి ఆర్ఎంఓ కె. చిరంజీవి, నర్సింగ్ సూపరింటెండెంట్ తోఫియా, కె.కృష్ణారావు, 108 సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు తప్పనిసరి



ర్యాలీ చేస్తున్న పోలీసులు

సీతంపేట: వాహనచోదకులు తప్పనిసరిగా రహదారి నిబంధనలు పాటించాలని పాలకొండ సీఐ ఎం.చంద్రమౌళి, ఎస్సై జగదీష్‌నాయుడు సూచించారు. ఈ మేరకు సీతంపేటలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని సూచించారు. మద్యం మత్తులో వాహనాలు నడపరాదన్నారు. మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ర్యాలీలో ఆటో, మ్యాక్సి పికప్, మినీ వ్యాన్ డ్రైవర్లు పాల్గొన్నారు.

జీలుగు చెట్ల పెంపకంలో గిరిజనుల ప్రత్యేక శ్రద్ధ



పూతికవలసలో పొలం గట్లపై గిరిజనులు పెంచుతున్న జీలుగు చెట్లు

సాలూరు రూరల్: మండలంలోని ఏజెన్సీ గ్రామాల గిరిజనులు జీలుగు చెట్ల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. జీలుగు చెట్ల నుంచి వేసవికాలంలో కల్లు తీసి అమ్మకాలు చేస్తుంటారు. గిరిజనులు సహజ సిద్ధగా కొండలపై పెరిగే చెట్ల నుంచి జీలుగు కల్లు తీసి గతంలో అమ్మకాలు చేసేవారు. అయితే ఈ మధ్యకాలంలో కొండలపై పెరిగే మొక్కల శాతం గణనీయంగా తగ్గిపోవడంతో గిరిజనులు వారు వ్యవసాయం చేసే పోడుభూముల్లో గట్టుపై ప్రత్యేకంగా జీలుగుమొక్కలు నాటి పెంచుతున్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి

పాలకొండ: రైతులు ఏరువాక పౌర్ణమిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కొండాపురం గ్రామ ఆయకట్టు పరిధిలో ఏరువాక పూజలు చేపట్టారు.అనంతరం పశువులకు పూజలు చేశారు. ప్రకృతి కరుణించి మంచి పంటలు పండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు బుడితి అప్పలనాయుడు, చోబోదుల లక్ష్మీనారాయణ, కిమిడి రామ్మూర్తినాయుడు, సర్పంచ్ రాయి వనజ, రైతులు పాల్గొన్నారు.



ఏరువాక పూజలు చేస్తున్న రైతులు

పనసకు మంచి గిరాకీ



విక్రయానికి సిద్ధం చేసిన ఖర్జ రకం పనస పండ్లు

కురుపాం: స్థానిక మార్కెట్‌లో పనస పండ్లకు మంచి గిరాకీ ఉంది. గతేడాది ఒక పనస పండు ధర రూ.80 నుంచి రూ.100 వరకు కొనుగోలు చేయగా ప్రస్తుతం మార్కెట్‌లో ఒక పనస పండు ధర రూ.150 నుంచి రూ.200 వరకు పలుకుతోంది. పనస పండ్లలో పోషకాలు పుష్కలంగా ఉండడంతో ఎక్కువ శాతం మంది ప్రజలు వాటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ పండ్లలో బురద పనస, ఖర్జ పనస పండ్లని రెండు రకాలు ఉండగా, చాలామంది ఖర్జ పనస పండ్లను కొనుగోలు చేసేందుకు మక్కువ చూపిస్తుండడం విశేషం.

బాలికలను రక్షిద్దాం.. చదివిద్దాం..



బాలికల హక్కులపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కురుపాం: బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మండలంలోని నీలకంఠాపురం, కురుపాం, గుమ్మ, టొంపలపాడు, మొండెంఖల్ గ్రామాల్లో కళాజాతా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కురుపాం ఐసీడీఎస్ పీవో కె.విజయగౌరి, కళాజాతా కళాకారులు కలిసి బాల్యవివాహాల నిర్మూలన, బాలల చట్టాలు, బాలికల హక్కులపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలను బరువుగా భావించవద్దని, వారికి త్వరగా పెళ్లి చేసి పంపించేందుకు ప్రయత్నించవద్దని సూచించారు. బాలికలను రక్షిద్దాం.. బాలికలను చదివిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సదుపాయం కల్పించండి



సుదూర ప్రాంతానికి వెళ్లి, తాగునీరు తెచ్చుకుంటున్న జిజారుగూడ గ్రామ మహిళలు

కురుపాం: మండలంలోని తిత్తిరి పంచాయతీ, జిజారుగూడ గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా తీవ్రమైన నీటి కరువు ఎదుర్కొంటున్నామని, కిలోమీటరు దూరంలోని సీడుగూడ గ్రామం సమీపానికి నీటికోసం వెళ్తున్నామని తెలిపారు. ఇదే సమస్యను అధికారులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, తాగునీటి సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.